నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. లక్ష్మీనగర్, ఊర్జిత 1, 2, 3 టెనెంట్ ప్రాపర్టీస్, నైబర్‌హుడ్, ఏజీ సైట్, మాణిక్యరెడ్డినగర్, అపర్ణ, మైసమ్మగూడలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంటల వ్యవధిలోనే యజమాని చెంతకు..

- పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు
- సీసీ ఫుటేజీ ఆధారంగా బాధితులకు అందజేత



ఆభరణాల బ్యాగును బాధితులకు అందజేస్తున్న పోలీసులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్కూటీపై వెళ్తుండగా కిందపడిపోయిన బ్యాగులోని 10 తులాల బంగారు ఆభరణాలను బాధితులకు గంటల వ్యవధిలో అందించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లికి చెందిన భార్యాభర్తలు స్కూటీపై వెళ్తున్న సమయంలో పీర్జాదిగూడ పంచవటి కాలనీ వద్దకు రాగానే బైక్‌పై నుంచి బ్యాగు కిందపడిపోయింది. వారు కొద్ది దూరం వెళ్లి చూసేసరికి వారి బ్యాగు కనిపించలేదు. దీంతో కంగుతిన్న బాధితులు వెంటనే మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సకాలంలో స్పందించి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా ఓ ప్యాసింజర్ ఆటో వ్యక్తి కిందపడిపోయిన బ్యాగును తీసుకెళ్లడాన్ని గమనించారు. ఆ ఆటోను సీసీ ఫుటేజీల ఆధారంగా పరిశీలించి, అదేదారిలో వెళ్లి ఆటోను కనిపెట్టారు. అనంతరం ఆ ఆటోలో వారి బ్యాగ్ కనిపించింది. పోలీసులు బ్యాగును పరిశీలించగా బ్యాగులోని 10 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. బాధితురాలు షమాకు పోలీస్‌స్టేషన్‌లో బంగారాన్ని తిరిగి అప్పగించారు. గంటల వ్యవధిలోనే బంగారాన్ని అప్పగించినందుకు పలువురు పోలీసులను అభినందించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్కాజిగిరి: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ మీర్జాలగూడకు చెందిన శశిమోహన్(52) వ్యాపారి. ఈనెల 10న అదే ప్రాంతంలోని సోనియా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద అతడి తలకు గాయమై పడి ఉన్నాడు. సత్తిరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న శశిమోహన్ సోదరుడు రామకృష్ణకు ఫోన్ ద్వారా స్థానికులు సమాచారం అందించారు. సోదరుడు అక్కడకు చేరుకుని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ల విస్తరణ ఎప్పుడో.. ?

- ఇరుకుగానే పాత మేడ్చల్, ప్రధాన కాలనీల రహదారులు
- అసంపూర్తిగా పనులతో ప్రజల అవస్థలు

మేడ్చల్ : పట్టణంలో ఆ రెండు రోడ్లు ప్రధాన రహదారులు. పాత మేడ్చల్‌కు వెళ్లే రోడ్డు ఒకటైతే, మేడ్చల్‌లో ప్రధాన కాలనీలను కలిపే రోడ్డు మరోటి, ఒక రోడ్డు మొదట విడిచి మిగతా రోడ్డు విస్తరణ చేయగా.. మరో రోడ్డు మొదట్లో విస్తరించి వదిలేశారు. ఒక రోడ్డు వ్యాపారాలకు కేంద్రంగా ఉంది. కాగా మరోటి 4–5 కాలనీలు, రెండు గ్రామాలకు వెళ్లే రోడ్డు. ఈ రోడ్లపై అధికారులు దృష్టి సారించి పెరిగిన జనాభాకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.


అసంపూర్తిగా నిలిచిపోయిన శాంతా బయోటెక్ రహదారి

నీటి మూటలైన హామీలు..

కాలనీలకు అందమైన రోడ్డు వేస్తామని చెప్పిన అమాత్యుల మాటలు నీటిమూటలుగానే మిగిలియాయి. రెండేళ్లు గడుస్తున్నా.. రోడ్డు విస్తరణ పనులు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అనే చందంగా ఉన్నాయి.

పార్కింగ్‌లకు అడ్డాగా..

కోర్టుకు వచ్చే వాహనాలకు విస్తరణ కోసం చేసిన అసంపూర్తి రోడ్డు పార్కింగ్‌కు అడ్డాగా మారింది. కోర్టు వరకు ట్రాఫిక్ సమస్య తీరినా మిగతా రోడ్డు ఇరుకుగా ఉండటంతో సమస్యలు తప్పడం లేదు. చిరు వ్యాపారులు, ఇతర వ్యాపారులు రోడ్డు స్థలంలో తమ వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని రోడ్డును కేంద్రంగా మార్చుకున్నారు.

ప్రధాన రహదారి కూడా..

మేడ్చల్ పట్టణం, జాతీయ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి రైల్వేస్టేషన్ వరకు ఉన్న రోడ్డు, మెయిన్ రోడ్డు ఇరుకుగా మారడంతో ఇతర రోడ్లు అభివృద్ధి చెందాయి. 20 ఏళ్ల క్రితం మేడ్చల్ గ్రామ పంచాయతీ ఉన్న సమయంలో నాటి సర్పంచ్ రాజేశ్వర్‌గౌడ్ హయాంలో రోడ్డు విస్తరణ చేశారు. రైల్వేస్టేషన్ నుంచి మార్కెట్ చౌరస్తా వరకు విస్తరణ చేయగా జాతీయ రహదారి వైపు విస్తరణ చేస్తుండగా.. అపశ్రుతి దొర్లి వ్యక్తికి గాయాలు కావడం, రోడ్డు విస్తరణ అర్ధాంతరంగా నిలిచిపోయింది. రాజకీయ నాయకులు ప్రవేశంతో విస్తరణ పనులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. రోడ్డులో భవనాలు ఉన్న వారు తమకు అందజేసే నష్టపరిహారం విషయంలో కోర్టుకు వెళ్లడంతో విషయం పెండింగ్‌లో పడింది. ప్రస్తుత పాలకులు మేడ్చల్ రోడ్డు విస్తరణ చేపట్టడంతో పెండింగ్‌లో ఉన్న రోడ్ల న్యాయ సమస్యలు పరిష్కరించి అన్ని రోడ్లను విస్తరించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు..

ప్రభుత్వ ఐటీఐ వద్ద జాతీయరహదారి నుంచి బాలాజీనగర్ వరకు ట్రాఫిక్ సమస్య విపరీతంగా మారిందని, ఇరుకు రోడ్డును విస్తరిస్తామని చెప్పి వదిలేశారు. గత రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయి. జాతీయరహదారి నుంచి కోర్టు, బాలాజీనగర్, కేఎల్ఆర్‌నగర్, రాఘవేంద్రనగర్‌ల మీదుగా అత్వెల్లి శాంతాబయోటెక్ వరకు మున్సిపల్ రోడ్డు సింగిల్ రోడ్డు ఉంది. కాగా కాలనీలు పెరగడంతో రాకపోకలు పెరిగి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. కంపెనీకి వెళ్లే బస్సులు, ఇతర వాహనాల సంఖ్య పెరగడంతో రోడ్డును విస్తరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఐటీఐ ఉండటంతో అధికారులు రెండేళ్ల క్రితం సెప్టెంబర్ నెలలో ఐటీఐ ప్రహరీని కూల్చి, దాదాపు అర ఎకరం స్థలం తీసుకుని తిరిగి ప్రహరీని నిర్మించారు. దీంతో కోర్టు చివరి వరకు రోడ్డు రూ.38 లక్షలతో విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణ పనులను నాటి మంత్రులు మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.


విస్తరణకు నోచుకోని మేడ్చల్ రైల్వే స్టేషన్ రోడ్డు

గ్రేహౌండ్స్ కమాండో కుటుంబానికి అండగా ఉంటాం

ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: కర్రిగుట్టల్లో నక్సలైట్ల మందుపాతరకు బలై వీర మరణం పొందిన గ్రేహౌండ్స్ కమాండో ఘట్‌కేసర్ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తిక్క సందీప్ కుటుంబీకులను మాజీమంత్రి,, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పరామర్శించారు. బుధవారం ఆయన ఇంటికెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం రూ.3 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మరణించడం బాధాకరమని, వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తారని, సోదరుడికి కూడా ఉద్యోగం ఇవ్వాలని కోరారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మల్లారెడ్డి ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.


సందీప్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ మేయర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్లు అనురాధ, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, మాజీ ఎంపీటీసీ నర్సింగ్‌రావు, సుధాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఖలీల్, యాదగిరి స్థానికులు పాల్గొన్నారు.

కుంటను కమ్మేసిన గుర్రపు డెక్క !



మేడ్చల్: మేడ్చల్–గౌడవెళ్లి రోడ్డులో ఉన్న కుంట గుర్రపు డెక్కతో నిండిపోయి పొలాన్ని తలపిస్తుంది. ఆయకట్టు లేకపోవడంతో ఏడాది పొడవునా ఎప్పుడూ నీటితో నిండి ఉంటుంది. వర్షాలకు తోడుగా సమీప కాలనీల మురుగు కుంటలో చేరుతుండటంతో గుర్రపు డెక్క ఏపుగా పెరిగింది. కుంటలో చుట్టూ ఉన్న ముళ్ల కంప (తుమ్మ) చెట్లు నీళ్ల లోనే ఉండటంతో పూర్తిగా ఎండిపోయాయి. కుంట పరిసర ప్రాంతాలలో గుర్రపు డెక్కతో దోమల బెడద, దుర్వాసనతో సమీప కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు సమీక్షించి గుర్రపుడెక్కను తొలగించి, అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయండి


కొనుగోలు కేంద్రం వద్ద పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి

శామీర్‌పేట్: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి సూచించారు. బుధవారం మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి, లక్ష్మాపూర్, కేశవరం, జగ్గంగూడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత రాకుండా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సెంటర్ ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. ధాన్యం కొన్న వెంటనే ట్యాబ్ (ఆన్‌లైన్)లో రైతు వివరాలను నమోదు చేయాలన్నారు.

రూ.68 లక్షలతో అభివృద్ధి పనులు

కాప్రా: కాప్రా డివిజన్ సైనిక్‌పురి హైటెన్షన్ రోడ్డులో డీమార్ట్ నుంచి కాప్రా చెరువు వరకు రూ.68 లక్షలతో నిర్మించే స్ట్రోమ్ వాటర్ డ్రైయిన్ పనులను బుధవారం కార్పొరేటర్ స్వర్ణరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో కాప్రా డివిజన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. అనంతరం గెలిలీయా నగర్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో పర్యటించి క్రీడాకారులకు అదనపు గదులు నిర్మించాలని అధికారులను కోరారు. డీఈ బాలకృష్ణ, ఏఈ సూరజ్, కాంగ్రెస్ నాయకులు పవన్‌కుమార్, అరుణ్‌కిరణ్, మనోజ్‌కుమార్, దయాకర్, విజయ్‌కుమార్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్ : ఈనెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను మేడ్చల్‌లో సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఎల్లంపేట్‌లోని శ్రీరామ స్పిన్నింగ్ మిల్ కంపెనీలో మండల నాయకులు కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెను 20న నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అన్ని రంగాల కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండల సీఐటీయూ నాయకులు నరేష్, నర్సింగ్‌రావు, యాదగిరి, దేవమ్మ, తస్లీమ్‌బేగం, రావేరి, నాగరాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


జవహర్‌నగర్‌లో సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

జవహర్‌నగర్: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, అనురాధ అన్నారు. 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ జవహర్‌నగర్ మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో బుధవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కాలని చూస్తుందని ఆరోపించారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీసవేతనాలు లేవన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివబాబు, ఉపాధ్యక్షులు యాదయ్య, మున్సిపల్ నాయకులు రాములు, జయసుధ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్


నిందితుడు నీతూలిమా

ఘట్‌కేసర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. కాస్పాడ్ గ్రామం, పోస్ట దుమిరినేలి, రాయఘడ్ జిల్లా ఒడిశాకు చెందిన నీతూలిమా (24) బతుకుదెరువు కోసం ఘట్‌కేసర్ వలస వచ్చాడు. గాంధీనగర్‌లో ఉంటూ దినసరికూలీగా పనిచేస్తున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం పోలీసులు గాంధీనగర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. పోలీసుల తనిఖీల్లో 1100 గ్రాముల నిషేధిత గంజాయి లభ్యమైంది. అతడిని విచారించగా గంజాయి సేవించడమే కాకుండా ఇతరులకు విక్రయిస్తున్నట్లు తేలింది. నిందితుడి నుంచి గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

కీసర ఇన్‌చార్జ్ ఎంఈఓగా జమదగ్ని



కీసర: కీసర మండల నూతన ఇన్‌చార్జ్ ఎంఈఓగా రాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జమదగ్ని నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎంఈఓ శశిధర్ స్థానంలో జమదగ్ని నియమితులైనట్లు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూటీఎస్ కీసర మండల అధ్యక్షుడు చీర యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఈగ శ్రీనివాస్‌లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ గిరిప్రసాద్‌నగర్ కాలనీలో నిర్మిస్తున్న ఆలయానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మాజీ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ సమక్షంలో రూ.5 లక్షల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే దేవాలయాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. నాయకులు రాజశేఖర్, మనోహర్‌సాగర్, లింగోజి, సంసుద్దీన్, మంగమ్మ, హంసమ్మ, రాజు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

శామీర్‌పేట్: నేటి నుంచి 18 వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు 48 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని, నెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి రంగారెడ్డిజిల్లా కార్యదర్శులు డి.ప్రకాష్, ఎం.సంగీత తెలిపారు. బుధవారం శామీర్‌పేట మినీస్టేడియంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు సెలక్షన్లు జరిగాయి. ఈ సెలక్షన్స్‌కు ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు హాజరయ్యారని, అసోసియేషన్ తెలంగాణ కార్యదర్శి శిరీషారాణి, నెట్‌బాల్ సీనియర్ ప్లేయర్ డి.ఓంప్రకాష్ హాజరై ప్రారంభించారు. 8వ జాతీయ సబ్–జూనియర్స్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలు 15 నుంచి 18 వరకు జనగాంలో నిర్వహించడం జరుగుతుందని, ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

'డిగ్రీ'కి ఎదురు చూపులు !

ప్రతి ఏటా ఉన్నత విద్యకు దూరమవుతున్న పేదలు

- కళాశాల మంజూరు చేయాలని విద్యార్థుల నిరసనలు
- మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వీడని గ్రహణం


డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల ధర్నా (ఫైల్)

మేడ్చల్ : మేడ్చల్ పరిసర ప్రాంతాల పేద విద్యార్థులు ఉన్నత చదువు చదువుకోవాలనే ఆశ ఏళ్లుగా నెరవేరడం లేదు. నియోజకవర్గంలో 6 లక్షల మందికి పైగా జనాభా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మాత్రం మంజూరు చేయడం లేదు. ఏళ్లుగా పేద విద్యార్థుల కోసం విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేస్తున్నా.. ఫలితం మాత్రం లేకుండా పోతుంది. ఎన్నికల సమయంలో మేడ్చల్, ఘట్‌కేసర్‌లలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తామని, ప్రతీపార్టీ నుంచి పోటీచేస్తున్న అభ్యర్థులు ఎన్నికల హామీ ఇస్తున్నారే తప్పా.. గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ నియోజకవర్గంలో మేడ్చల్, శామీర్‌పేట్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట్, యాదాద్రి జిల్లాల శివారు మండలాల ప్రాంతాల విద్యార్థులు మేడ్చల్‌లోనే ఎక్కువగా విద్యను అభ్యసిస్తున్నారు. మేడ్చల్‌లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ సంస్థలు ఉన్నాయి. ఇంటర్ వరకు పేద విద్యార్థులు తమ చదువులను మేడ్చల్‌లోనే కొనసాగిస్తూ.. ఉన్నత చదువుల కోసం నగరానికి వెళ్లలేక చదువులు సగంలోనే మానేస్తున్నారు.

ఎన్నికల హామీగానే..

మేడ్చల్, ఘట్‌కేసర్ మండలాల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని దాదాపు 20 ఏళ్లుగా గెలిచిన ఎమ్మెల్యేలు, పోటీచేసి ఓడిన వారు హామీలు ఇస్తున్నారే గానీ, ఏ నాయకులు పేద విద్యార్థులు ఉన్నత విద్య కోసం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించాలని ఏనాడు ప్రయత్నించలేదనే విమర్శలున్నాయి. నియోజకవర్గ పేద విద్యార్థుల కోసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల పోరాటాలు..

విద్యార్థి సంఘాల నాయకులు ఏళ్ల తరబడి డిగ్రీ కళాశాల కోసం ఉద్యమాలు చేస్తున్నా.. మంజూరు మాటలకే పరిమితం అవుతోంది. విద్యార్థి సంఘాల జేఏసీగా ఏర్పడి ఏళ్ల తరబడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధనకు పోరాటాలు చేస్తున్నారు. ర్యాలీలు, విద్యార్థుల ప్రదర్శనలు, మంత్రుల, ఎమ్మెల్యేల పర్యటనలు అడ్డుకోవడం, సమావేశాల్లో నిలదీయడం, ధర్నాలు, రాస్తారోకో వంటి ఎన్నో కార్యక్రమాలు చేసినా వారికి పోలీసులు కేసులు తప్పా.. ఫలితం మాత్రం లేకుండా పోయింది.

గత ప్రభుత్వ హయాంలో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు రెండు డిగ్రీ కళాశాలలు మంజూరైనా.. అవి మేడ్చల్‌కు రాలేదు. ఉప్పల్, రాజేంద్రనగర్‌లకు వెళ్లడంతో గతేడాది మేడ్చల్‌కు భంగపాటు తప్పలేదు. ఈ నూతన సంవత్సరంలోనైనా మేడ్చల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరవుతుందని విద్యార్థులు కోటి ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.

పేద విద్యార్థులు నగరానికి వెళ్లలేక..

నియోజకవర్గంలో 7 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు, 5 మండలాలు ఉన్నా.. మేడ్చల్‌లో మినహా ఎక్కడ ప్రభుత్వ ఇంటర్ కళాశాల, డిగ్రీ కళాశాల లేకుండా పోయింది. గురుకులాలు ఉన్నా.. అవి అందరికీ ఉపయోగపడటం లేదు. పేద విద్యార్థులు గ్రామాల నుంచి నగరానికి వెళ్లలేక ప్రైవేటులో ఫీజులు చెల్లించలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. పట్టుబట్టి చదువుతున్న వారి తల్లిదండ్రులు ప్రైవేటు దోపిడీకి అప్పుల పాలవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఈ విద్యాసంవత్సరంలో మేడ్చల్‌కు డిగ్రీ కళాశాల మంజూరవుతుందేమోనని పేద విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.